# గోదావరి వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ అంకిత్

• ప్రజల ప్రాణ రక్షణకు ముందస్తు చర్యలు చేపట్టాలి.



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / జూన్ 6 / అక్షరం న్యూస్ -:
గోదావరి వరదల నేపథ్యంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ,అదనపు కలెక్టర్ వేణుగోపాల్, తదితర అధికారులతో కలిసి గోదావరి వరదల సన్నద్ధతపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరదల వల్ల ముంపునకు గురయ్యే గ్రామాలను ముందుగానే గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు బోట్లు, నాటుపడవలు, లైఫ్ జాకెట్లు, తాడులు, టార్చ్‌లైట్లు, హ్యాండ్ మైకులు, రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజలను ముంపు పరిస్థితులు ఏర్పడిన తర్వాత కాకుండా ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించేలా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు.గోదావరి నీటిమట్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వరద పరిస్థితులపై ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. ముంపు గ్రామాల ప్రజల ఫోన్ నంబర్లను సేకరించి సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని చెప్పారు. విద్యుత్, తాగునీరు, వైద్య సేవలు, నిత్యావసర వస్తువుల సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా సంబంధిత శాఖలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసే ఫ్లడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడంతో పాటు మండల, జిల్లా స్థాయిల్లో కూడా కంట్రోల్ రూములు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. గర్భిణీలు, వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులపై ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైతే ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. 108 అంబులెన్సులు, అత్యవసర మందులు, పాము కాటు, తేలు కాటు నివారణ వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు.లోతట్టు ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలు, డ్రెయిన్ల శుభ్రత, మంచినీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వాగులు, వంకలు పొంగిపొర్లే సమయంలో ప్రజలు దాటకుండా ప్రమాద హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. పశువుల రక్షణకు కూడా తగిన చర్యలు తీసుకోవాలని, పశువైద్య సేవలను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు.73 అడుగుల వరకు గోదావరి వరదలు వచ్చినా ఎదుర్కొనే విధంగా అన్ని శాఖలు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ ముంపు గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పునరావాస కేంద్రాలు, రెస్క్యూ బృందాలు, అవసరమైన సామగ్రి సిద్ధంగా ఉంచామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ పనిచేస్తున్నామని చెప్పారు.ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



సంగారెడ్డి జిల్లా /నారాయణఖేడ్ :నిజాం పేట్ /జూన్ 6/అక్షరం న్యూస్ :మండల కేంద్రమైన నిజాంపేట్ మండలంలోని మేగ్య నాయక్ తాండాకు చెందిన గిరిజనులు కందూర్ కార్యక్రమం నిమిత్తం గొడవాడి దర్గా కు వెళ్తుండగా వారు ప్రయాణిస్తున్న డీసీఎం వాహనం అదుపుతప్పి బోల్తాపడిన వి షాద ఘటనలో తల్లి మాలి బాయి, కుమారుడు రాములు మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు.ఈ దుర్ఘటన విషయంతెలుసుకున్ననారాయణఖేడ్ మాజీ శాసనసభ్యుడు మహారెడ్డి భూపాల్ రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించి, మృ తుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ.ప్రమాదంలో మృతి చెం దిన కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే ఒ క్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, గాయపడిన వారికి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మె ల్యే ఈ విషయంలో వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని కో రారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్ర మాదవశాత్తు మృతి చెందిన కుటుంబాల కు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించా మని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం వరుస విషాద సంఘటనలు చోటు చేసుకుంటున్న ప్పటికీ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు రాజు నాయక్, రవీందర్ నాయక్, గంగారాం, గోవింద్ నాయక్, మాజీ ఎంపీటీసీ గోపి, నర్య నాయక్, సురేష్ నాయక్, బాబు పాండు నాయక్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక ప్రధాన లక్ష్యం జిల్లా కలెక్టర్ అంకిత్.





భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం/ జూన్ 6 /అక్షరం న్యూస్ -:
ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా లక్ష్మీదేవి పల్లి మండలం కారుకొండ రామవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన గ్రామ సభకు జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మార్చి 6వ తేదీ నుండి అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా అమలు చేయబడుతోందని తెలిపారు.

గ్రామ సభలు ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలను చేరవేసే సమర్థవంతమైన వేదికలని అన్నారు. విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్యం, వర్షాకాలంలో అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని అన్నారు .

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు పంట మార్పిడి విధానాలను అనుసరించాలని, వ్యవసాయ శాఖ సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని సూచించారు. ఎరువులు, పురుగుమందుల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పంటల దిగుబడులు పెరిగేలా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని రైతులకు సూచించారు.గ్రామాల్లో సాలిడ్ అండ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే అలవాటు ప్రతి కుటుంబం అలవరుచుకోవాలని కోరారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని తెలిపారు.

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఎస్ఐఆర్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హుల పేర్లను జాబితా నుండి తొలగించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు.బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతులు, డిజిటల్ విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, రైతులు, గ్రామస్థులు పంట పొలాలకు వెళ్లే రహదారుల అభివృద్ధి, గ్రామంలోని విద్యుత్ అదనపు లైన్లు , అంతర్గత రహదారుల నిర్మాణం, తాగునీటి కి ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను వెంటనే చర్యలు చేపట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ , మాలోత్ భారతి, ఎంపీడీఓ, జి.సుస్మిత మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మీసేవ దరఖాస్తుల పరిశీలన పూర్తిగా ఆన్‌లైన్‌లోనే





• జీపీఓలు, ఆర్ఐలకు అవగాహన కల్పించిన ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు.

భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / జూన్ 6 / అక్షరం న్యూస్ -:
మీసేవ ద్వారా అందిస్తున్న వివిధ ధృవపత్రాల జారీ ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న డిజిటల్ విధానాలపై ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు అవగాహన కల్పించారు. చంద్రుగొండ తహసీల్దార్ జగదీశ్వర ప్రసాద్, అన్నపురెడ్డిపల్లి తహసీల్దార్ స్వర్ణ ఆధ్వర్యంలో ఆయా మండలాల జీపీఓలు, ఆర్ఐలు, మీసేవ వీఎల్ఈలు, సెక్షన్ అధికారులతో సమావేశం నిర్వహించి మీసేవ దరఖాస్తుల పరిశీలన, ధృవపత్రాల జారీ ప్రక్రియపై సమీక్షించారు.ఈ సందర్భంగా సైదేశ్వరరావు మాట్లాడుతూ మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకునే ఆదాయ, కుల, నివాస, కుటుంబ సభ్యుల ధృవపత్రాలు, ఈబీసీ, ఓబీసీ తదితర సేవల దరఖాస్తుల పరిశీలన పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నిర్వహించబడుతుందని తెలిపారు. దరఖాస్తుదారులు అప్లోడ్ చేసిన పత్రాలను మాత్రమే జీపీఓలు, ఆర్ఐలు పరిశీలించి అర్హత మేరకు ఆమోదం లేదా తిరస్కరణ నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. భౌతిక పత్రాలను స్వీకరించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన యాప్ వినియోగంపై అధికారులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. యాప్ ద్వారా దరఖాస్తుల పరిశీలనను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించవచ్చని వివరించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు.మీసేవ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన రుసుములను మాత్రమే వసూలు చేయాలని, అదనపు రుసుములు వసూలు చేయరాదని తెలిపారు. దరఖాస్తుల నమోదు సమయంలో వివరాలు సక్రమంగా నమోదు చేయాలని, డేటా ఎంట్రీలో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే ధృవపత్రాల జారీ అనంతరం సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు.మీసేవ సేవలకు సంబంధించిన సాంకేతిక లేదా పరిపాలనా సమస్యలు ఎదురైనప్పుడు మండల స్థాయి జీపీఓ, ఆర్ఐ లేదా తహసీల్దార్‌ను సంప్రదించాలని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు అధికారులు, మీసేవ కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల జీపీఓలు, ఆర్ఐలు, మీసేవ వీఎల్ఈలు, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికే వార్డ్ సభలు



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/జూన్ 6/అక్షరం న్యూస్: తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళికల కార్యక్రమంలో భాగంగా, శనివారం ఎల్లారెడ్డి మున్సిపల్ కేంద్రంలోని 4,5,6 వార్డులలోమునిసిపల్ కమి షనర్ జగ్జీవన్ ఆధ్వర్యంలో వివిధ వార్డులకు చెందిన కౌ న్సిలర్లతో కలిసి వార్డ్ సభలనువిజయవంతంగానిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు తమ వార్డులోని ప్రతి ఒక్క సమస్యను అధికారుల దృష్టికి తీసు కురావాలని, సంబంధిత వార్డ్ ఆఫసర్లకు తమ సమస్యల పై దరఖాస్తులు అందించాలని సూచించారు. అనంతరం వివిధ వార్డులలో నెలకొని ఉన్నసమస్యలపై ప్రజల నుండి వినతులను స్వీకరించి, వాటిని సత్వరమే పరిష్కరించే ది శగాసంబంధిత అధికారులకుసూచనలు జారీ చేశారు. వా ర్డు సభలలోమున్సిపల్ కమిషనర్ సంబంధిత వార్డు కౌన్సి లర్లు, వార్డు అధికారులు, విద్యుత్ శాఖ,వ్యవసాయ శాఖ అధికారులు,వార్డుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి స రఫరా, వీధిదీపాల నిర్వ హణ, ప్రజాసంక్షేమ కార్యక్రమాల తో పాటు,మౌలికసదుపాయాలకుసంబంధించిన అంశాల పై విస్తృతంగా చర్చించారు.ఈకార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ జగ్జీవన్, మున్సిపల్ కౌన్సిలర్లుసయ్యద్ గఫార్, అట్కరిచంద్రయ్య,దుంపల మంజులశంకర్ వివిధ వార్డుల వార్డ్ ఆఫీసర్లు, ఏఈ వినోద్ కుమార్, మునిసిపల్ మేనేజ ర్ వాసంతి వివిధ శాఖలకు చెందిన అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# నకిలీ లేబర్ కార్డులు లేకుండా చర్యలు చేపట్టాలి

కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/జూన్ 6/అక్షరం న్యూస్: కామారెడ్డి జిల్లా తెలంగాణ భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం ఆధ్వర్యం లో కామారెడ్డి జిల్లా కేంద్రానికి వచ్చిన నూ తన సహాయ కార్మిక అధికారి రాజు ను శ నివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలు వాతోసత్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ భవననిర్మాణ రంగాల కార్మిక సంఘం జిల్లా ఇన్చార్జి మర్లుసాయిబాబా,జిల్లా కన్వీ నర్ పత్తి బ్రహ్మారెడ్డి కార్మికులు ఎదుర్కొంటు న్న సమస్యలను ఆయనకు వివరించారు. నకిలీ లేబర్ కార్డులను రద్దుచేసి, నిజమైన కార్మికులను గుర్తించి, నిజమైన కార్మికులకు మాత్రమే ప్రభుత్వ సంక్షేమ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన నిజ మైన కార్మికుల సమస్యలపరిష్కారానికి కృ షి చేస్తానని, నకిలీ లేబర్ కార్డులను రద్దు చేసి, నకిలీ లేబర్ కార్డుల జారిని అరికట్టేం దుకు ప్రత్యేక చర్యలు చేపడతాననిఈ సం దర్భంగా ఆయన హామీ ఇచ్చారు.



# ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/జూన్ 6/అక్షరం న్యూస్: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చే సుకున్న సంఘటన ఎల్లారెడ్డి మండల కేం ద్రంలోని సబ్దల్పూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎల్లారెడ్డి పట్టణ ఎస్ ఐ ఎన్.రాజు తెలిపిన వివరాల ప్రకారం సబ్దల్ పూర్గ్రామానికిచెందిన జక్కుల రాజు (39) పెయింటర్ గా పనిచేస్తూ జీవనం సాగించే వాడు. అతనికి ఒక కుమార్తె ఉండగా, మా టూర్ గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం జరిపించాడు. ఇదే తరుణంలోఅతని భార్య కిష్టమని 5 నెలల క్రితంగుండెపోటుతో మృతి చెందింది. కూతురి వివాహానికి చేసిన అ ప్పులుతీరకపోవడంతో పాటు,భార్య మృతి పట్లమనస్థాపానికిగురై, జీవితంపైవిరక్తి చెం ది,శనివారం గ్రామ శివారులోని చెట్టుకు ఉ రివేసుకొనిఆత్మహత్య చేసుకున్నాడు. మృ తుడి కూతురైన జక్కుల స్పందన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్సై తెలిపారు.

# విద్యార్థులు సాంస్కృతిక పోటీల్లో రాణించాలి

**జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్.**




భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / జూన్ 6 అక్షరం న్యూస్ –:

ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు పుస్తకాల పురుగులుగా మారుతున్నారని, అలా కాకుండా సాంస్కృతిక పోటీల్లో, క్రీడల్లో రాణించినప్పుడే వారు మానసిక ఉల్లాసంగా ఉంటారని జై భీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, న్యాయవాది యెర్రా కామేష్ అన్నారు. కొత్తగూడెం క్లబ్ లో రైసింగ్ స్టార్ డాన్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి సూపర్ డాన్స్ సీజన్ –3 పోటీలకు ముఖ్య అతిథిగా కామేష్ హాజరై డాన్స్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. అనంతరం కామేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ఉదయం నుంచి రాత్రి వరకు కేవలం పుస్తకాలకే పరిమితం చేస్తున్నారని, ఇలా చేయడం వల్ల వారిలో దాగి ఉన్న కళలను బయటకు తీయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అలా కాకుండా ప్రతీ ఒక్కరిలో అంతర్లీనంగా ప్రతిభ దాగి ఉంటుందని ఆ ప్రతిభను గుర్తించి వారికి తగిన శిక్షణను ఇస్తే అద్భుతాలు సృష్టించవచ్చునని అన్నారు. డాన్స్ పోటీలకు విచ్చేసిన చిన్నారులను చూస్తుంటే ముచ్చటేస్తుందన్నారు. ఎలాంటి బెరుకు లేకుండా చిన్నారులు అద్భుతంగా తమ నృత్యాన్ని ప్రదర్శించారని కొనియాడారు. కొత్తగూడెం కళాకారులు జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. సూపర్ డ్యాన్సర్ 2వ సిరీస్ వల్లే 3వ సిరీస్ పోటీలు చాలా చక్కగా నిర్వహించిన డాన్స్ మాస్టర్స్ కనకం ప్రవీణ్ కుమార్, సందెబోయిన సంపత్ కుమార్ లను ప్రత్యేకంగా అభినందించారు. న్యాయనిర్ణేతలుగా హైదరాబాద్ దీపక్, రచ్చ మధు, భద్రాచలం శ్యామ్ లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో యామిని ఆసుపత్రి వైద్యులు యామిని కుమారి, నరసింహా సంజీవ్ రావు, మాజీ కౌన్సిలర్ రుక్మెంధర్ బండారి, కొప్పుల యశ్వంత్, సహాస్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీ సమస్యలు ఉన్నాయా? అయితే ఈ ఆహార పదార్థాలకు దూరంగా ఉండాల్సిందే!

మన శరీరంలోని వ్యర్థాలను వడబోసి, రక్తాన్ని శుద్ధి చేయడంలో కిడ్నీలు (మూత్రపిండాలు) కీలక పాత్ర పోషిస్తాయి. అయితే, కిడ్నీలు బలహీనపడినప్పుడు అవి సోడియం, పొటాషియం, ఫాస్ఫరస్ వంటి ఖనిజాలను సమర్థవంతంగా బయటకు పంపలేవు. అటువంటి సమయంలో మనం తీసుకునే ఆహారం కిడ్నీలపై అదనపు భారం పడకుండా చూసుకోవాలి. ముఖ్యంగా కిడ్నీ సమస్యలు ఉన్నవారు ఏయే ఆహారాలకు దూరంగా ఉండాలో ఇప్పుడు తెలుసుకుందాం.

1. ఉప్పు, సోడియం అధికంగా ఉండే పదార్థాలు: కిడ్నీ సమస్యలు ఉన్నప్పుడు ఉప్పు(సోడియం) వాడకాన్ని తగ్గించాలి. ఆహారంలో ఉప్పు ఎక్కువగా ఉంటే అది రక్తపోటును పెంచి కిడ్నీలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. అలాగే, నిల్వ ఉంచిన పచ్చళ్లు, అప్పడాలు, చిప్స్, ప్యాక్ చేసిన స్నాక్స్, జంగ్ ఫుడ్ వంటి వాటికి దూరం ఉంచితే మంచిది. వంటల్లో ఉప్పును సాధ్యమైనంత వరకు తగ్గించుకోవడం మంచిది.

2. పొటాషియం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలు: అరటిపండ్లు, నారింజ, కివీ, కర్బూజ వంటి పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. అలాగే, ఎండు ద్రాక్ష, ఖర్జూరం వంటి ఎండిన పండ్లను పరిమితం చేయాలి. బంగాళదుంపలు, చిలకడదుంపలు, టమోటాలు, పాలకూరలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. వీటిని నీళ్లలో ఉడకబెట్టి ఆ నీటిని పారబోసి వండుకోవడం మంచింది.

3. ఫాస్ఫరస్ అధికంగా ఉండే డైరీ ఉత్పత్తులు: కిడ్నీలు సరిగ్గా పనిచేయనప్పుడు రక్తంలో ఫాస్ఫరస్ పేరుకుపోతుంది, ఇది ఎముకల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. పాలు, పెరుగు, జున్ను, పన్నీర్ వంటి పదార్థాలను వైద్యుల సలహా మేరకు చాలా తక్కువగా తీసుకోవాలి. అలాగే ముదురు రంగులో ఉండే సోడా పానీయాలకు పూర్తిగా మానేయాలి.

4. ప్రాసెస్ చేసిన మాంసం: బేకన్, సాసెజ్, నిల్వ ఉంచిన మాంసాలలో ఉప్పుతో పాటు ఇతర ప్రిజర్వేటివ్స్ అధికంగా ఉంటాయి. ఇవి కిడ్నీలపై తీవ్రమైన ఒత్తిడిని కలిగిస్తాయి. సూప్స్, నూడుల్స్ లో సోడియం అధికంగాఉంటుంది. ఫ్లేవర్ కోసం కలిపిన ఆర్టిఫిషియల్ కెమికల్స్ ఉంటాయి. ఇందులో సోడియం లెవెల్స్ అధికంగా ఉంటాయి. సోడియం పెరిగే కొద్దీ కిడ్నీలపై ఒత్తిడి పెరుగుతుంది. 5. ధాన్యం: గోధుమ రొట్టెలు, బ్రౌన్ రైస్ ఆరోగ్యానికి మంచివే అయినా, వీటిలో ఫాస్ఫరస్, పొటాషియం వంటి ఖనిజాలు అధికంగా ఉంటాయి. సాధ్యమైనంత వరకు ఈ రైస్‌ను కిడ్నీ వ్యాధిగ్రస్తులు డైట్‌లో చేర్చుకోకూడదు.

# కోహెడలో అంతర్జాతీయ సమీకృత ఫ్రూట్ మార్కెట్






- తెలంగాణ వ్యవసాయ రంగానికి కొత్త దిశ
- నాణ్యమైన ఉత్పత్తులే ప్రభుత్వ లక్ష్యం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

రంగారెడ్డి కోహెడ క్రైమ్ ప్రతినిధి జూన్ 6: కోహెడ లో అంతర్జాతీయ సమీకృత ఫ్రూట్ మార్కెట్ నిర్మాణానికి, ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్టార్ ఆఫీస్ కాంప్లెక్స్ కు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఎంపీ లు వేం నరేందర్ రెడ్డి,చామల కిరణ్ కుమార్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు,శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంఎల్ ఏ లు మల్ రెడ్డి రంగా రెడ్డి , వీర్లపల్లి శంకరయ్య, నవీన్ యాదవ్ ,కసిరెడ్డి నారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, కిరణ్మయ, గడ్డిఅన్నారం మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు , తదితరులు పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా కోహెడలో అంతర్జాతీయ సమీకృత ఫ్రూట్ మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడంతో పాటు రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గతంలో రైతులు పండించిన పండ్లు, కూరగాయలు, పాలు హైదరాబాద్ నగర ప్రజల అవసరాలను తీర్చేవని, అయితే పట్టణీకరణ రియల్ ఎస్టేట్ విస్తరణ కారణంగా వ్యవసాయ భూముల విస్తీర్ణం తగ్గిందన్నారు. ప్రస్తుతం కోటి ముప్పై లక్షలకు పైగా జనాభా కలిగిన హైదరాబాద్ అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఆహార అవసరాలను తీర్చేందుకు ఆధునిక వ్యవసాయ మౌలిక వసతులు అవసరమని తెలిపారు. గతంలో తాత్కాలిక షెడ్లలో నిర్వహించిన మార్కెట్‌లో ప్రమాదాలు చోటుచేసుకున్నాయని గుర్తు చేస్తూ, రైతులకు భద్రతతో కూడిన అంతర్జాతీయ ప్రమాణాల మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామన్న హామీ మేరకు 240 ఎకరాల్లో ఆధునిక ఫ్రూట్ మార్కెట్‌ను నిర్మిస్తున్నామని చెప్పారు. అంతర్జాతీయ విమానాశ్రయం తర్వాత కోహెడ ఫ్రూట్ మార్కెట్ రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పండ్లు, కూరగాయల ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందని, కందుకూరు ప్రాంతంలో ఉత్పత్తి అయ్యే టమోటా ఆధారంగా సాస్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రైతులకు మార్కెటింగ్, నిల్వ, ప్రాసెసింగ్ సదుపాయాలు కల్పించడం ద్వారా వ్యవసాయాన్ని లాభదాయకంగా మారుస్తామని తెలిపారు. ఫ్రూట్ మార్కెట్ నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేలా అవసరమైన నిధులను గ్రీన్ ఛానల్ ద్వారా విడుదల చేస్తామని, ఈ ఏడాది డిసెంబర్ నాటికి మార్కెట్ కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెండు సంవత్సరాల్లో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేపడుతున్నామని, ప్రపంచ ప్రసిద్ధి చెందిన సంస్థలను అక్కడకు ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే రీజనల్ రింగ్ రోడ్, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, వరంగల్ ఆదిలాబాద్ విమానాశ్రయాల అభివృద్ధి వంటి కీలక ప్రాజెక్టులను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవుటర్ రింగ్ రోడ్ పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి సమీకృత ఆధునిక కార్యాలయ సముదాయాల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం రిజిస్ట్రేషన్ల ద్వారా రాష్ట్రానికి భారీ ఆదాయం వస్తోందని, ఆ ఆదాయానికి అనుగుణంగా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, వరి పంటకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి నమోదైందని చెప్పారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో భాగంగా రాష్ట్రంలో 15 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని, 3.28 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, రైతులకు రూ.20 వేల కోట్ల రుణమాఫీ, మహిళలకు వడ్డీ రాయితీతో బ్యాంకు లింకేజ్ రుణాలు, మహిళల ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా కొనసాగిస్తున్నామని, తెలంగాణను దేశంలో ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

# సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించండి లేదంటే ఉద్యమం తప్పదు - సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి

- 7, 8 తేదీల్లో రెండు రోజులపాటు ఎఐటీయూసీ సెంట్రల్ కౌన్సిల్ సమావేశం.
- ఆరు జిల్లాల నుంచి 151 మంది ప్రతినిధుల పాల్గొనింపు కార్మిక సమస్యలు, సింగరేణి భవిష్యత్తుపై సుదీర్ఘ చర్చలు.



భద్రాద్రి కొత్తగూడెం/ కొత్తగూడెం/ జూన్ 6 / అక్షరం న్యూస్ –:

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటీయూసీ) సెంట్రల్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 7, 8 తేదీలలో కొత్తగూడెంలోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఎఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య తెలిపారు. ఈ కౌన్సిల్ సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరుకానున్న కొత్తగూడెం శాసనసభ్యులు,ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు కూనంనేని సాంబశివరావు, అదేవిధంగా సమావేశాలకు సింగరేణి పరిధిలోని ఆరు జిల్లాల నుంచి సుమారు 151 మంది యూనియన్ ప్రతినిధులు, నాయకులు హాజరుకానున్నారు. సమావేశంలో సింగరేణి సంస్థ ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణ, కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, యాజమాన్యం మరియు ప్రభుత్వాల విధానాలపై విస్తృత స్థాయిలో చర్చలు జరగనున్నాయని ఆయన వెల్లడించారు. సంస్థ మనుగడ, అభివృద్ధి కోసం కొత్త ప్రాజెక్టుల ఏర్పాటు, బొగ్గు ఉత్పత్తి పెంపు, సంస్థ ప్రైవేటీకరణ ప్రయత్నాలకు వ్యతిరేకంగా చేపట్టాల్సిన పోరాటాలపై కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. అలాగే కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రతి రెండు నెలలకు ఒకసారి డైరెక్టర్ స్థాయి, ప్రతి మూడు నెలలకు ఒకసారి సీఎండీ స్థాయి నిర్మాణాత్మక సమావేశాలు గుర్తింపు సంఘం తో నిర్వహించేలా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించనున్నట్లు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న 11వ క్యాడర్ స్కీమ్ అమలు, వారసత్వ ఉద్యోగాల పునరుద్ధరణ, ప్రతి నెలా మెడికల్ బోర్డు సమావేశాల నిర్వహణ, మారుపేర్ల సమస్య పరిష్కారం, పర్క్‌పై విధిస్తున్న ఆదాయపు పన్ను భారం తొలగింపు, ప్రతి కార్మికునికి 200 గజాల ఇంటి స్థలం కేటాయింపు, రూ.30 లక్షల వడ్డీలేని గృహ రుణం మంజూరు వంటి అంశాలు కూడా ప్రధానంగా చర్చకు రానున్నాయి. అదేవిధంగా సింగరేణి వ్యాప్తంగా మైన్స్, డిపార్ట్‌మెంట్లలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, జెన్‌కో నుంచి రావాల్సిన రూ.53 వేల కోట్ల బకాయిలను తక్షణమే వసూలు చేయాలని సమావేశం డిమాండ్ చేయనుంది. కార్మిక వ్యతిరేక విధానాలు, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలు, యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలపై భవిష్యత్ పోరాటాలు, ఉద్యమాల రూపకల్పనపై రెండు రోజులపాటు సుదీర్ఘ చర్చలు జరుగుతాయని మిరియాల రంగయ్య తెలిపారు. కొమరయ్య విగ్రహావిష్కరణకు భారీగా తరలిరావాలి. ఈ నెల 8వ తేదీ సాయంత్రం 4 గంటలకు సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట పునఃప్రారంభించే మనుబోతుల కొమరయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి యూనియన్ నాయకులు, కార్మికులు, అభిమానులు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మిరియాల రంగయ్య పిలుపునిచ్చారు.

# 20 న జరిగే జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి..

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. ప్రేమలత.**

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, భద్రాద్రి కొత్తగూడెం



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / జూన్ 6 / అక్షరం న్యూస్ –:

తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు, ఈ నెల జూన్ 20న శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.ప్రేమలత మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి ఎం. రాజేందర్ శనివారం ఒక ప్రకటన లో వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కక్షిదారులు తమ పెండింగ్ కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఒక అద్భుతమైన అవకాశమని పేర్కొన్నారు.

రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు చెక్ బౌన్స్ కేసులు బ్యాంకు రికవరీ కేసులుమోటార్ వాహన ప్రమాద నష్టపరిహార కేసులు

వివాహ బంధానికి సంబంధించిన కేసులు ఆస్తి పంపకాల వివాదాలు, అద్దె వివాదాలు మరియు ఇతర సివిల్ కేసులు డ్రంక్ అండ్ డ్రైవ్ మరియు ఇ –చలాన్ కేసులు

సైబర్ క్రైమ్ కేసులు చిన్న చిన్న దొంగతనం కేసులు

టెలిఫోన్ కేసులు మనోవర్తి కేసులు కొట్టుకున్న కేసులు బ్యాంకు కేసులు మొదలైన కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే పని లేకుండా తక్షణమే తుది తీర్పు లభిస్తుందని తెలిపారు. ఇక్కడ గెలుపోటములు ఉండవని, ఇరుపక్షాల అంగీకారంతోనే నిర్ణయం జరుగుతుందని అన్నారు. దీనిపై మళ్ళీ అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండదని తెలిపారు. జిల్లాలోని కక్షిదారులు, ప్రతివాదులు తమ న్యాయవాదుల ద్వారా లేదా నేరుగా సంబంధిత కోర్టులలో సంప్రదించి తమ కేసులను లోక్ అదాలత్ జాబితాలో చేర్చుకోవాలని మరియు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కోర్టుల చుట్టూ తిరిగే శ్రమను, ఖర్చును తగ్గించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోరారు.

## ఘనంగా కార్మిక శాఖ మంత్రి వివేక్ సరోజ దంపతుల వివాహ వేడుకలు.



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ జూన్ 06/ అక్షరం న్యూస్ –:

తెలంగాణ రాష్ట్ర కార్మిక మరియు గనుల శాఖ మాత్యులు డా" గడ్డం వివేక్ వెంకటస్వామి – సరోజ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలను మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. శనివారం మందమర్రి పట్టణంలోని పంచముఖి హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మంత్రి వివేక్ వెంకటస్వామి సరోజ దంపతులు సుఖ, సంతోషాలతో జీవించాలని ఈ ప్రాంతానికి మరిన్ని సేవలు చేయాలని ఆకాక్షించారు. అనంతరం వారి పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి పుల్లూరి లక్ష్మణ్, మాజీ ప్రధాన కార్యదర్శి సొత్కు సుదర్శన్,ఎస్.సి సెల్ జిల్లా చైర్మన్ పైడిమల్ల నర్సింగ్, సంగీ సంతోష్, బేర వేణుగోపాల్, ఏడుకోల పవన్ కుమార్, జావీద్ ఖాన్, రాయబారపు కిరణ్, మూడారపు శేఖర్, యూత్, మహిళా, మైనారిటీ, సేవాదళ్ మరియు అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సర్వేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ సేనలో భారీ చేరికలు

- నిరుడు సర్వేష్ ముదిరాజ్ నాయకత్వంపై విశ్వాసంతో పార్టీలో చేరిన మహిళా, యువ నాయకులు.
- రంగారెడ్డి జిల్లాలో బలోపేతం అవుతున్న తెలంగాణ రక్షణ సేన.

నిరుడు సర్వేష్ ముదిరాజ్ సమక్షంలో మహేశ్వరం నాయకుల చేరిక కార్యక్రమం.



రంగారెడ్డి జిల్లా :శంకర్పల్లి : జూన్ 6: అక్షరం న్యూస్ –:

రంగారెడ్డి జిల్లా రాజకీయాల్లో తెలంగాణ రక్షణ సేన పార్టీ రోజురోజుకు బలోపేతం అవుతోందని పార్టీ సీనియర్ నాయకుడు నిరుడు సర్వేష్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన మహిళా నాయకురాలు బండారు సరితతో పాటు పలువురు మహిళా నాయకులు, యువ నాయకులు తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు.వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన కల్వకుంట్ల కవిత, పార్టీ సిద్ధాంతాలు మరియు ప్రజా సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై నాయకులు పార్టీలో చేరడం శుభపరిణామమని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, బీసీ వర్గాల సాధికారత లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ ముందుకు సాగుతోందని నిరుడు సర్వేష్ ముదిరాజ్ తెలిపారు.రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారం కోసం పార్టీ నిరంతరం పోరాటం చేస్తోందని, ఈ క్రమంలో యువత మరియు మహిళలు స్వచ్ఛందంగా పార్టీలో చేరడం పార్టీపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసే రాజకీయ వేదికగా తెలంగాణ రక్షణ సేన ఎదుగుతోందని పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో పార్టీ విస్తరణకు కొత్తగా చేరిన నాయకులు కీలక పాత్ర పోషించాలని నిరుడు సర్వేష్ ముదిరాజ్ సూచించారు.గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.రానున్న రోజుల్లో మరింత మంది నాయకులు తెలంగాణ రక్షణ సేనలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని వెల్లడించారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన బండారు సరిత మరియు ఇతర నాయకులు మాట్లాడుతూ, కల్వకుంట్ల కవిత నాయకత్వం తమను ఆకర్షించిందని తెలిపారు.ప్రజల కోసం పనిచేసే లక్ష్యంతో తెలంగాణ రక్షణ సేనలో చేరినట్లు పేర్కొన్నారు.పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సంస్థ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా ప్రతినిధులు, యువజన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# మున్సిపల్ కార్పొరేషన్‌లో సిపిఐ పక్ష బలాన్ని సమర్థవంతంగా చాటాలి





- కౌన్సిల్ సమావేశాల్లో ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటం చేయాలి.
- ప్రజాసేవకు, సమస్యల పరిస్కారానికి కార్పొరేటర్లు అంకితం కావాలి.
- బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ పార్టీ ప్రతిష్టను పెంచాలి.
- బస్తీల వారీగా స్థానిక సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారానికి కృషి చేయాలి.

ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రణాళికాబద్ధంగా కార్పొరేషన్ అభివృద్ధికి బాటలు వేయాలి.

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై గళమెత్తాలి.
- అధిక ధరలకు నిరసనగా ఈనెల 10న జరిగే కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి.
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు.

భద్రాద్రి కొత్తగూడెం /కొత్తగూడెం / జూన్ 6 / అక్షరం న్యూస్ –: కౌన్సిల్ సమావేశాల్లో ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ సిపిఐ పక్ష కార్పొరేటర్ల సమావేశం కొత్తగూడెం శాసనసభ సభ్యుల వారి కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. సిపిఐ పక్ష కార్పొరేటర్లు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పౌర సేవలు అందించాలని సూచించారు. రాబోయే కౌన్సిల్ సమావేశంలో అనుసరించాల్సిన విధానాలపై దిశానిర్దేశం చేస్తూ, ప్రజాసమస్యల పరిష్కారానికి కార్పొరేటర్లు ముందుండాలన్నారు. పట్టణంలోని ప్రతి వార్డు పరిధిలో నెలకొన్న డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాల వంటి సమస్యలను గుర్తించి వాటి తక్షణ పరిష్కారానికి మున్సిపల్ అధికారులతో కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల వల్ల సామాన్యులపై భారం పడుతోందని, నిత్యావసర వస్తువుల అధిక ధరలకు నిరసనగా ఈనెల 10వ తేదీన చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని కార్పొరేటర్లు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన వివరించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, మేయర్ మూడ్ గణేష్, కార్పొరేటర్లు, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా కార్పొరేషన్‌ను అభివృద్ధి చేసుకుందాం





- ప్రాధాన్యతా క్రమంలోనే అభివృద్ధి పనులు కేటాయించాలి.
- త్రాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

త్వరలో నీటిసమస్యకు శాశ్వత పరిస్కారం.

- మౌలిక సదుపాయాల కల్పనకు పాలకవర్గం నిరంతరం కృషిచేయాలి.
- సిబ్బంది కొరతను తీర్చేవిధంగా నియమాకాలు చేపట్టండి.
- సమిష్టి నిర్ణయాలతో సమస్యలు లేని కార్పొరేషన్‌గా నగరాన్ని తీర్చిదిద్దుదాం.
- పట్టణ సమగ్ర శ్రేయస్సు కోసం కట్టుబడి ఉంటా.
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు.

భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / జూన్ 6 / అక్షరం న్యూస్ –: : ప్రణాళికాబద్ధంగా కార్పొరేషన్‌ను అభివృద్ధి చేసుకోవాలని, ప్రతి డివిజన్‌లోనూ ప్రజల అవసరాలను గుర్తించి ముందుకు సాగాలని సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ కౌన్సిల్ సమావేశం మేయర్ మూడ్ గణేష్ అధ్యక్షతన శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశానికి కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. నగర పరిధిలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులను ప్రజాప్రతినిధులను ఆదేశించారు. ప్రధానంగా ఎండకాలం దృష్ట్యా త్రాగునీటి సమస్య పరిస్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య తీవ్రంగా వున్నచోట ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్యాన ఏర్పాట్లు చేయాలనీ, ప్రజల కనీస మౌలిక సదుపాయాల కల్పనకు పాలకవర్గం నిరంతరం కృషి చేయాలనీ సూచించారు. ....పతాకంకు సంబంధించి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, పనులు పూర్తయితే కార్పొరేషన్లో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిస్కారం లభిస్తుందన్నారు. ప్రస్తుతం కార్పొరేషన్లో సిబ్బంది కొరత వేధిస్తోందని, త్వరలోనే ఉన్నతాధికారులతో మాట్లాడి అదనపు సిబ్బందిని పెంచేలా చూస్తామన్నారు. విద్యుత్, పారిశుద్ధ్యం, అంతర్గత రోడ్లు, మురుగు కాలువల డ్రైన్లు తదితర దీర్ఘకాలిక సమస్యల పరిస్కారంపై తాము ఇప్పటికే ప్రేత్యేక ద్రుష్టి సారించామని స్పష్టం చేశారు. ఎలాంటి సమస్యలు లేని ఆదర్శ కార్పొరేషన్ గా కొత్తగూడెం కార్పొరేషన్ ను తీర్చిదిద్దేందుకు అందరం కలిసికట్టుగా శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, కార్పొరేషన్ అభివృద్ధికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి వున్నానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలను తయారు చేయడమే జనసేన పార్టీ ముఖ్య ఉద్దేశ్యం: చిరాగ్ ప్రజీత్ గౌడ్

రంగారెడ్డి జిల్లా/శంకర్‌పల్లి : జూన్ 06: అక్షరం న్యూస్ – : నవతరం నాయకులను తయారు చేయడమే జనసేన పార్టీ ముఖ్య ఉద్దేశ్యం అని చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి చిరాగ్ ప్రజీత్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చిరాగ్ ప్రజీత్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా జనసేన పార్టీ పై గాని, పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పై జరుగుతున్న దుష్ప్రచారాలని తిప్పికొట్టడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. పార్టీ అధినేత సూచన మేరకు సామాజిక తెలంగాణ పోరాటం కోసం యువత పార్టీలోకి రావాలని పిలుపునిచ్చారు.

ప్రాంతీయ భావాన్ని గౌరవిస్తూ, జాతీయ భావానికి కట్టుబడి ఉండటమే కార్యకర్తలకి సూచన అని, భవిష్యత్తులో గ్రామ స్థాయి నుండి క్రమశిక్షణ కలిగిన కార్యకర్తల తయారీ పార్టీ విధానం అని తెలియజేశారు. కొందరు చేస్తున్న అసత్య ప్రచారాలని తిప్పికొట్టే విషయంలో, ప్రజలకి అసలైన విషయం అందించే విషయంలో మీడియా మిత్రులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సాయికుమార్ గౌడ్, దివాకర్, శ్రీనివాస్, గీత, తెలుగు సాయి, ఆగేష్ పాల్గొన్నారు.



## ఆదాయం కోసం అడ్డగోలు నిర్ణయాలు

- భూముల విలువలకు తోడు..మద్యం ధరలు
- ఈ నెలలోనే మద్యం ధరలు పెంచే యోచన



హైదరాబాద్,జూన్6 రాష్ట్ర ప్రభుత్వం భూముల విలువలను పెంచేసింది. ఆదాయం సమకూర్చుకోవడం లక్ష్యంగా ఎట్టకేలకు శుక్రవారం నుంచి అమలులోకి తెచ్చింది. మరో వారం పదిరోజుల్లో మద్యం ధరలు కూడా పెరగనున్నాయి. ఒక్కో బాటిల్‌పై 80 నుంచి వందవరకు పెంచుతారన్న ప్రచారం సాగుతోంది. తెలంగాణలో మద్యం ధరలు పెరగనున్నాయి. పెరిగిన ధరలు ఈనెల 15 నుంచి అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. లిక్కర్ తయారీ కంపెనీల ఒత్తిడి మేరకు ప్రభుత్వం మద్యం ధరలను పెంచడానికి సిద్ధమైనట్లు సమాచారం. ముడి సరుకుల ధరలు, రవాణా ఖర్చులు బాగా పెరిగిన నేపథ్యంలో మద్యం ధరలను కూడా పెంచాలని లిక్కర్ కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఈమేరకు ప్రభుత్వం కూడా సానుకూలంగానే ఉంది. భూముల ధరలు పెంచడం, మద్యం ధరలు పెంచడం ద్వారా ఉచిత పథకాలకు ఢోకా లేకుండా చూసుకుంటున్నారు. అలాగే భూములను కూడా ఎక్కడిక్కడ తెగనమ్ముతున్నారు. ఇదిలావుంటే ఈసారి భూముల విలువలు పెరుగుతాయనే అనుమానంతో ఆస్తుల క్రయ, విక్రయదారులు గురువారం వరకు పెద్ద మొత్తంలో స్లాట్లు బుక్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తాజాగా, భూముల మార్కెట్ విలువలు రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి రాగానే రిజిస్ట్రేషన్లు తక్కువ

సంఖ్యలో అయ్యాయి. ప్రతి జిల్లాలో సగటున 50శాతం వరకు భూ విలువలు పెరగ్గా, కమర్షియ ల్ ప్రాంతాల్లో భారీగా పెంచారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ అధికారులు పెద్దగా పెంపు లేదని చెబుతున్నా, ప్రాంతాల వారీగా పెరిగిన మార్కెట్ విలువలను చూస్తుంటే రిజిస్ట్రేషన్ల భారం అధికంగానే ఉంది. భూముల ధరలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలతో పాటు అభివృద్ధి, పారిశ్రామిక ప్రాంతాలు ఉన్న చోట మార్కెట్ విలువలను 50శాతం మేర పెంచారు. గ్రామీణ, పట్టణాల్లో క్షేత్రస్థాయి అధ్యయనం చేసి శాస్త్రీయంగా మార్కెట్ విలువలను సవరించామని అధికారులు చెబుతున్నా, ఆస్తుల క్రయ విక్రయదారులకు భారీగానే భారం మోపారని తెలుస్తోంది. ధరలు పెరుగుతాయని ముందస్తు సమాచారం తోనే పాత ధరలకే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పలువురు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. భూముల విలువలు సవరణతో మార్కెట్ విలువ ప్రకారం అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో రిజిస్ట్రేషన్లు భారం కానున్నాయి. వాస్తవానికి ఏటా కొంత మేరకు మార్కెట్ విలువలను సవరించాల్సిన ప్రభుత్వం ఏకంగా ఒకేసారి పెంచడంతో ఆస్తుల క్రయవిక్రయదారులపై భారం పెరిగింది. ప్రజలపై భారాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వ ఖజానాను నింపేలా మాత్రమే అధికారులు కసరత్తు చేశారని తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిన అధికారులు గతంలో ఉన్న మార్కెట్ విలువలను రెట్టింపు చేశారని, ఇది శాస్త్రీయంగా లేదని పలువురు పేర్కొంటున్నారు. వ్యవసాయ భూముల విలువను సైతం భారీగా పెంచడంతో ఆస్తుల కొనుగోలుదారులు ఆందోళనకు గురవుతున్నారు. కమర్షియల్ ప్రాంతాల్లో 100శాతం మేరకు మార్కెట్ విలువలను పెంచారు. కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో, రిజిస్ట్రేషన్లు తక్కువగా ఉన్న చోట స్వల్పంగా పెంచినా, పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరేలా మార్కెట్ విలువను పెంపుదల చేశారు. మార్కెట్ విలువలు పెరగడంతో స్టాంపు డ్యూటీ, ఇతర రిజిస్ట్రేషన్ చార్జీల భారం సామాన్య, మధ్య తరగతి ప్రజలపై అధికంగానే ఉండనుంది.

## పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

- ఇరాన్ డ్రోన్లను కూల్చిన అమెరికా సైన్యం
- హోర్ముజ్ జలసంధి వద్ద మళ్లీ ఉద్రిక్తతలు



టెహ్రాన్, జూన్ 6 పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మళ్లీ ముసురుకుంటున్నాయి. హోర్ముజ్ జలసంధి లక్ష్యంగా ఇరాన్ ప్రయోగించిన నాలుగు డ్రోన్లను అమెరికా సైన్యం కూల్చివేసింది. దీనికి ప్రతీకారంగా, ఇరాన్ తీరప్రాంతంలోని నిఘా రాడార్ కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులకు దిగింది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది.హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు ఇరాన్ డ్రోన్ల వల్ల తక్షణ ముప్పు పొంచి ఉందని అమెరికా సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. ఆత్మరక్షణ చర్యల్లో భాగంగానే జలసంధిలోని ఒక ద్వీపంతో పాటు ఇరాన్ తీరంలోని కీలక రాడార్ సైట్‌లపై తాము దాడులు చేసినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. మరోవైపు, ప్రపంచ ఇంధన సరఫరాకు గుండెకాయ లాంటి హోర్ముజ్ జలసంధిపై పట్టు సాధించేందుకు ఇరాన్ ప్రయత్నిస్తుండగా, అందుకు ప్రతిగా అమెరికా ఇరాన్ రేవులపై ఆంక్షలు, దిగ్బంధనాన్ని విధిస్తోంది. ఈ వారంలోనే కువైట్ ప్రధాన విమానాశ్రయంలోని ప్యాసింజర్ టెర్మినల్‌పై ఇరాన్ డ్రోన్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరు మరణించగా, డజన్ల కొద్దీ ప్రయాణికులు గాయపడ్డారు. దీనివల్ల ఎయిర్‌ఫీల్డ్ తాత్కాలికంగా మూతపడింది. ఈ దాడితో తీవ్ర ఆగ్రహానికి గురైన అమెరికా, తాజా ఘర్షణతో ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు పంపింది. రాడార్ సైట్‌లపై దాడులతో పాటు, హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తున్న ఇరాన్ లింక్డ్ చమురు ట్యాంకర్‌ను అమెరికా సైన్యం తమ ఆధీనంలోకి తీసుకుంది. ఆంక్షల పరిధిలో ఉన్న చమురును విక్రయించడం ద్వారా ఇరాన్ లాభపడకుండా అడ్డుకునేందుకు అమెరికా ఈ చర్య చేపట్టింది. అలాగే, ఇరాన్ ఇంధన రంగానికి సహాయం చేస్తున్న పలువురు వ్యక్తులు, సంస్థలు, ట్యాంకర్లపై అమెరికా కొత్తగా మరికొన్ని ఆర్థిక ఆంక్షలను విధించింది. ఇరాన్-అమెరికా ఘర్షణ కేవలం జలసంధికే పరిమితం కాలేదు. అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, లెబనాన్ ప్రభుత్వాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ మద్దతున్న హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థ తిరస్కరించింది. ఈ క్రమంలో శుక్రవారం ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ లెబనాన్‌లోని ఎక్కువ భాగాన్ని ఇజ్రాయెల్ ఇప్పటికే తన ఆధీనంలోకి తెచ్చుకుంది. మరోవైపు, హోర్ముజ్ జలసంధి తెరవాలన్నా, శాశ్వత కాల్పుల విరమణ కుదరాలన్నా లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు ఆగాలని ఇరాన్ పట్టుబడుతోంది.

# ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట ఏదీ ?

హైదరాబాద్,జూన్6 ఆర్థిక కుంభకోణాలు, మోసాలను పసిగట్టలేక పోతున్నారు. దేశంలో ఎవరు ఎలా దోచేస్తున్నారో గుర్తించడం లేదు. అధికారంలో ఉన్నవారిది ఒక ర కమైన దోపిడీ, ఆర్థికంగా ఉన్నవారిది మరో రకమైన దోపిడీ అన్నట్లుగా కాలం నడుస్తోంది. అధికారంలో ఉండి ఆర్థిక మోసాలకు పాల్పడ్డ వారిని ఏమీ చేయడం లేదు. వారు అక్రమాలకు పాల్పడ్డట్లు రుజువులున్నా బోను ఎక్కించడం లేదు. తమ అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యంగా చేస్తున్న పనులపై నిఘా లేకుండా పోయింది. అజమాయిషీ లేదు. విచారణలు లేవు. తెలంగాణలో కాళేశ్వరం కథ కంచికి చేరింది. లక్షకోట్లు పెట్టి ఓ ప్రాజెక్ట్ కడితే అందులో అవతవకలు, ఆర్థిక మోసాలు జరిగాయన్న వారే దానిపై విచారణ జరిపించడం లేదు. ఇ- కార్ రేసులో నేరుగా విదేశీ సంస్థకు డబ్బులు చెల్లించినా కిమ్మనడం లేదు. ఎపిలో రుషికొండపై జగన్ ప్యాలెస్‌లు కట్టుకుంటే చర్యలు లేవు. మద్యం కుంభకోణానికి పాల్పడితే దిక్కులేదు. భూకుంభకోణ్యాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికే దేశంలో అనేక ఆర్థిక మోసాలు జరిగాయి. విజయ్ మాల్యా, నీరవ్ మోడీ, లలిత్ మోడీ వంటివారు దేశం బయటనే ఉన్నారు. వారిపై ఎలాంటి చర్యలు లేవు. దేశంలో కొందరు బ్యాంకులకు ఎగనామం వేస్తున్నా పట్టింపు లేదు. ఇవన్నీ కూడా ఇతరకుల ఆదర్శంగా నిలుస్తున్నాయని భావించాలి. తాజాగా రాజేష్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ (ఆర్‌ఇఎల్) భారీ ఆర్థిక అరాచకం దేశంలోనే కాదు అంతర్జాతీయ కార్పొరేట్ రంగాన్ని షేక్ చేస్తోంది. ఇలాంటి వారు మోసం చేస్తున్నా..గుర్తించలేక పోయారు. ఎల్‌ఐసి లాంటి సంస్థ ఇందులో పెట్టుబడులు పెట్టి ఇప్పుడు భారీగా నష్టపోయింది. ఆర్థిక మోసాలను ఎంత చాకచక్యంగా చక్కబెట్టవచ్చో 'లక్కీ భాస్కర్' మూవీలో చూపించారు. 1980లనాటి షేర్ల స్కామ్ కింగ్ పిన్ బిగ్‌బుల్ హర్షద్ మెహతా షేర్ మార్కెట్‌ను ఎలా మోసం చేశడో గుర్తుండే ఉంటుంది. వ్యవస్థలోని లొసుగులను తమకు అనుకూలంగా మార్చుకొంటున్న పలువురు భారీ అక్రమాలకు బరితెగిస్తున్నారు. వారి చేతుల్లో ఎంతోమంది అమాయకులు మోసపోతున్నారు. సహారా ఇండియా, అగ్రిగోల్డ్, లీఫిన్ ఇండియా లాంటి సంస్థలు కూడా ఎంతగా మోసం చేశాయో చూసాం. ఇటీవల నల్లగొండ, కర్నూలు జిల్లాలో మైక్రో ఫైనాన్స్ మోసం బయటపడింది.



అయినా ప్రభుత్వాలు కళ్లు తెరవడం లేదు. కఠిన నిర్ణయాలు తీసుకోవడం లేదు. చిట్టీల పేరుతో గ్రామాలు మొదలు పట్టణ్యాల వరకు కోట్లల్లో మోసలు చేస్తూనే ఉన్నారు. తాజాగా బెంగళూరుకు చెందిన ప్రముఖ బంగారం, ఆభరణాల దిగ్గజం ఆర్‌ఇఎల్ తన వాస్తవ ఆదాయాన్ని రూ.15.15 లక్షల కోట్లు అధికంగా చూపించి, తన షేర్ వాల్యూను భారీగా పెంచుకొని, మదుపరులను, అలాగే ప్రభుత్వ వ్యవస్థలను మోసగించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని సెక్యూర్టీస్ అండ్ ఎక్సేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా సెబి విచారిస్తే తప్ప వెలుగులోకి రాలేదు. ఆర్‌ఇఎల్ స్కాం దేశ కార్పొరేట్ చరిత్రలో అతిపెద్ద కుంభకోణంగా చెబుతున్నారు. ఇలాంటి స్కామే 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సత్యం కంపెనీలో జరిగింది. రూ.7,800 కోట్ల మేర కంపెనీ బ్యాలెన్స్‌షీట్‌లో తేడా వచ్చింది. ఎక్కువ ఆదాయం చూపించి సత్యం కంపెనీ షేర్ విలువను పెంచుకుందని ఆరోపణలొచ్చాయి. ఈ కేసులో సత్యం కంపెనీ అధినేత రామలింగరాజుకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ అదానీ కంపెనీ ఆర్థిక మోసాలను ఆధారాలతో సహా 2003 జనవరిలో బయటపెట్టడం పెను సంచలనం అయింది. ఆదానీ గ్రూపు తమ షేర్ విలువను పెంచుకునేందుకు గ్రూపు ఆదాయాన్ని అధికంగా చూపించడంతోపాటు పలు ఆర్థిక అవకతవకలకు పాల్పడిందన్నది ప్రధాన అభియోగం. దాంతో అదానీ ఆర్థిక సామ్రాజ్యం రూ.లక్షల కోట్ల మేర పతనమైంది. తూతూ మంత్రంగా సెబి దర్యాప్తు సాగింది.

చివరికి అదానీ గ్రూపుపై 'హిండెన్‌బర్గ్'వి ఆధారాల్లేని ఆరోపణలుగా కొట్టిపారేసింది. ఉదారవాద ఆర్థిక విధానాలే ఆర్థిక స్కాంలకు మూలం. ఓ సామాన్యుడు సెబీకి లేఖ రాయడం, అది విచరణ చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆర్‌ఇఎల్ కంపెనీ ప్రమోటర్, ప్రస్తుత ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అయిన రాజేష్ మెహతాను సెక్యూర్టీస్ మార్కెట్ నుంచి తాత్కాలికంగా నిషేధించింది. ఆర్‌ఇఎల్ అక్రమాలను కేంద్ర ప్రభుత్వ సంస్థలుకానీ, నిఘా విభాగాలు కానీ గుర్తించలేకపోవడం వ్యవస్థీకృతంగా ఉన్న జాడ్యంగా చూడాలి. ఒక సాధారణ ఇన్వెస్టర్ 2025లో ఇ-మెయిల్‌లో చేసిన ఫిర్యాదుతో తీగ లాగితే డొంక కదిలింది. సెబి రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టినా, కంపెనీకి సంబంధించిన ఆడిట్ రిపోర్టులను చూపించమని పలు మార్లు నోటీసులిచ్చినా ఆర్‌ఇఎల్ యాజమాన్యం సహకరించలేదు. అందుకే సెబి ఆ సంస్థ స్కాంపై నివేదిక వెల్లడించాల్సి వచ్చింది. రార్పొరేట్ స్కాంలన్నింటిలో దండలో దారంలో కనిపించేది విదేశాల్లో ఆ సంస్థలు ఏర్పాటు చేసే అనుబంధ షెల్, సూట్‌కేస్ కంపెనీలు, వాటి ద్వారా ఈ దేశంలో అక్రమాలు. ఆర్‌ఇఎల్ కూడా అదే చేసింది. సిట్జర్లాండ్ నుంచి కథ నడిపించింది. ప్రపంచంలోనే అతిపెద్ద గోల్డ్ రిఫయినరీ 'వాల్కంబీ'ని 2015లో కొనుగోలు చేసింది. సంస్థ ఆదాయాన్ని రూ.వందల కోట్లను వేలు లక్షల కోట్లుగా తప్పుడు పద్ధతుల్లో చూపించింది. సంస్థ సి.ఎం.డి. రాజేష్ మెహతా తన వ్యక్తిగత ఖాతాలకు సంస్థ నిధులను భారీగా నిబంధనలకు విరుద్ధంగా మళ్లించారు. సంస్థలో కీలక స్థానాల్లో ఉన్న మరి కొంత మంది సైతం ఇదే పని చేశారు. ఈ కఠోర విషయాలను సెబినే వెల్లడించింది. కంపెనీ కార్పొరేట్ గవర్నెన్స్ లోపభూయిష్టంగా ఉందని ఇప్పుడు గుర్తించడం ప్రభుత్వ వ్యవస్థల పనితీరులో డొల్లతనానికి నిదర్శనం. ఇలాంటివి ఇంకా ఎన్ని జరుగుతున్నాయో తెలియదు. బయటపడితే తప్ప తెలుసుకోలేం. ప్రజలు అనేక విధాలుగా ఇప్పుడు మోసపోతున్నారు. ఈ క్రమంలో పకడ్బందీ చర్యలతో ఆర్థిక మోసాలకు కళ్లెం వేయాలి. కేవలం సైబర్ మోసాలే కాకుండా ఇలాంటి బడా మోసాలపైనా దృష్టి సారించాలి.

# దేశ ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిన బిజెపి

- కొద్దిమంది కార్పొరేట్ సంస్థల చేతుల్లో దేశ సంపద
- దిగజారుతున్న పేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాలు
- కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా 9న సిపిఎం దేశవ్యాప్త నిరసనలు



రాజమహేంద్రవరం,జూన్6 దేశ ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారాలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిన పేపర్ లీకేజీలు, ప్రజా రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక హక్కులపై దాడులకు వ్యతిరేకంగా జూన్ 9న దేశవ్యాప్తంగా నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఎం తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన ఓ సమావేశం శనివారం సిపిఎం కార్యాలయంలో జువ్వల రాంబాబు అధ్యక్షతన జరిగింది.ముఖ్య అతిధి గా పాల్గొన్న వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేసిందన్నారు. సంపద కొద్దిమంది కార్పొరేట్ సంస్థల చేతుల్లో కేంద్రీకృతమవుతుండగా, పేదలు మరియు మధ్యతరగతి ప్రజల జీవన పరిస్థితులు రోజురోజుకు దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో నిరుద్యోగం గతంలో ఎన్నడూ లేని స్థాయికి చేరుకుందని, కోట్లాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో బలహీనపరుస్తోందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను విపరీతంగా పెంచడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగి ప్రజల జీవనం భారంగా మారిందన్నారు. రైతులకు పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని పేర్కొన్నారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని, వివిధ ప్రవేశ, ఉద్యోగ పరీక్షల్లో వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలు పరీక్షా వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీశాయని అన్నారు. లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాలపాటు శ్రమించి పరీక్షలకు సిద్ధమవుతుంటే, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వారి భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని, ఎనిమిది గంటల పని విధానాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. కార్మికులు సాధించుకున్న హక్కులను కాపాడుకోవడానికి విస్తృత ఐక్య పోరాటాలు అవసరమని అన్నారు.ప్రజల జీవన సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజలను విభజించే రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ప్రజల అసలు సమస్యలైన ఉపాధి, విద్య, వైద్యం, ధరల నియంత్రణ వంటి అంశాలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి టి అరుణ్ మాట్లాడుతూ ధరల పెరుగుదల, నిరుద్యోగం, పేపర్ లీకేజీలు, కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రజా రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జూన్ 9న నిర్వహించే నిరసన కార్యక్రమాలలో ప్రజలు, యువత, విద్యార్థులు, కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆంధ్రా పేపర్ లిమిటెడ్ కడియం యూనిట్ లో యాజమాన్యం నిరంకుశ వైఖరి కారణంగా 1200 మంది పర్మినెంట్ కాంట్రాక్టు కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్య పరిష్కారం చేయాలని కోరారు. సమావేశం లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి పవన్, పి తులసి, జిల్లా కమిటీ సభ్యులు సుందర బాబు, పూర్ణిమ రాజ్, ఎస్ ఎస్ మూర్తి, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా నిరోధానికి చర్యలు

అధికారును ఆదేశించిన మంత్రి వివేక్

హైదరాబాద్,జూన్6 రాష్ట్రంలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై మంత్రి వివేక్ వెంకటస్వామి సీరియస్ అయ్యారు.అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు నిఘా వ్యవస్థ బలోపేతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. లారీల కదలికలపై నిరంతరం పర్యవేక్షించాలని హుకుం జారీ చేశారు. ఇసుక ఆదాయం పెంపుపై టీజీఎండీసీ అధికారులతో మంత్రి వివేక్ వెంకటస్వామి శనివారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ఇసుక నిర్వహణలో పూర్తి పారదర్శకత పాటించాలని దిశానిర్దేశర చేశారు. అలాగే, సాండ్ బజార్ల పనితీరుపై మంత్రి వివేక్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కీలక ఖనిజాల అన్వేషణ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఖనిజ వనరుల సమర్థ నిర్వహణకు అమలు వ్యవస్థ పటిష్ఠం చేయాలని సూచించారు. అక్రమ మైనింగ్ నియంత్రణ చర్యలను మంత్రికి.. టీజీఎండీసీ అధికారులు వివరించారు. రాష్ట్ర ఖనిజ రంగంలో ఆదాయ వృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

## సత్వరంగా మహిళా సమాఖ్య భవన నిర్మాణాలు

అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క

హైదరాబాద్,జూన్6 మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలు వేగవంతం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. 8 వేల గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. ఇవి మహిళల ఆత్మగౌరవ భవనాలని మంత్రి సీతక్క అభివర్ణించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సర్ అధికారులతో మంత్రి సీతక్క శనివారం సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. మహిళా భవనాల నిర్మాణ పురోగతిని రోజూ పరిశీలిస్తామని తెలిపారు. ఈ నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం సహించ బోమని హెచ్చరించారు. ఎంపీడీవోలు ఈ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత, పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులు నిరంతర పర్యవేక్షించాలని దిశానిర్దేశర చేశారు. ఉపాధి హామీ పనుల అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి పనుల్లో లక్ష్యాల సాధించాలని అధికారులకు.. మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు.

## కాక్‌టెయిల్-2 లో నటించడానికి భయపడ్డా: రష్మిక



కొద్ది రోజుల్లో 'కాక్‌టెయిల్ 2'తో ప్రేక్షకుల్ని అలరించడానికి ముస్తాబవు తోంది అందాల తార రష్మిక. ఆమె, షాహిద్ కపూర్, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రమిది. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో దియా పాత్రలో కనిపించనుంది రష్మిక. ఈ నేపథ్యంలోనే ఓ కార్యక్రమంలో పాల్గొన్న రష్మిక.. ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. 'ఈ ప్రాజెక్టులో నటించడం గురించి నేను అంత సులభంగా నిర్ణయం తీసుకోలేదు. ముఖ్యంగా ఇందులో నటించడానికి నిజంగా భయపడ్డాను. ఎందుకంటే ఇప్పటి వరకు నేను భాగమైన చిత్రాల్లో ఇంత మోడ్రన్‌గా కనిపించలేదు. అందుకే ప్రారంభంలో ఈ చిత్రంలో నటించడం గురించి నేను తీసుకున్న నిర్ణయం సరైందా? కాదా? అనే సందేహం ఉండేది. కానీ అదే సమయంలో ఇంతకు ముందెప్పుడూ ఇలాంటి పాత్రలో చేయలేదు కాబట్టి.. ఇందులో నటించాను' అని చెప్పింది.

## జూలై నుంచి కల్కి-2 రెగ్యులర్ షూటింగ్



ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న 'కల్కి 2' అప్‌డేట్ గురించి నాగ్ అశ్విన్ క్లారిటీ ఇచ్చారు. సినిమా పనుల గురించి వివరణ చేస్తూ.. కల్కి 2 షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. వచ్చే జూలై నుండి కంటిన్యూగా షూటింగ్ ప్లాన్ చేశాం. చాలా శరవేగంగా షూటింగ్ పూర్తి చేసేలా అన్ని సన్నాహాలు జరుగుతున్నాయని నాగ్ అశ్విన్ వెల్లడించారు. ఈ అప్‌డేట్‌తో ప్రభాస్ అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

## పెద్దికి ఊహించని విజయం

- దర్శక,నిర్మాతల ఆనందం

'మేం నమ్మిన విషయాన్ని ప్రేక్షకులు నిజం చేశారు. స్ఫూర్తిదాయకమైన 'పెద్ది' సినిమాని తమ పిల్లలతో కలిసి కుటుంబాలు ఆస్వాదిస్తున్నాయి. రానున్న పది రోజుల్లో 'పెద్ది' మరింత పెద్ద విజయంగా నిలుస్తుంది' అన్నారు బుచ్చిబాబు సానా. ఆయన దర్శకత్వంలో... రామ్‌చరణ్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'పెద్ది'. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మించారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సమర్పించాయి. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా బాక్సాఫీస్ ఛాంపియన్ పేరుతో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించింది చిత్రబృందం. దర్శకుడు మాట్లాడుతూ 'చాలా పెద్ద విజయం ఇది. ముందస్తు ప్రదర్శనల నుంచే నా ఫోన్ ఆగకుండా మోగుతోంది. నా తొలి చిత్రం 'ఉప్పెన' కంటే పది రెట్లు మించిన స్పందన వచ్చింది. సినిమా చూసినవాళ్లంతా ఎంతో స్ఫూర్తి పొందామని చెబుతున్నారు. రామ్‌చరణ్ పడిన కష్టాన్ని అందరూ గుర్తించారు. ఆయన లేకపోతే ఈ సినిమా లేదు' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల ఆదరణతో అద్భుతంగా దూసుకుపోతోంది 'పెద్ది' చిత్రం. తొలి రోజే రూ.135 కోట్లకుపైగా వసూళ్లు సాధించింది. రామ్‌చరణ్ కెరీర్‌లోనే అత్యుత్తమైన సినిమాగా నిలుస్తూ, రికార్డ్ స్థాయిలో వసూళ్లు సాధిస్తోంది. నిర్మాత రవిశంకర్ యలమంచిలి మాట్లాడుతూ 'తెలుగులో ఇప్పటివరకూ చూడని ఓ కొత్త రకమైన క్రీడా నేపథ్యంలోని సినిమా ఇది. పిల్లలకు ఎంతగానో ఉపయోగపడే చిత్రం. అందుకే ఇంటిల్లిపాదీ వెళ్లి చూడాలని కోరుతున్నాం. దర్శకుడు బుచ్చిబాబు రాసిన కథ, అద్భుతమైన రామ్‌చరణ్ నటన కారణంగా ఈ సినిమా రికార్డు స్థాయిలో వసూళ్లు సాధిస్తోంది' అన్నారు.

## విమర్శలు కూడా సృజనాత్మకతగానే చూడాలి


- నటి అనసూయా భరద్వాజ్



సినిమా అంటేనే కేవలం కల్పిత కథ అని.. అందులోని తప్పొప్పులు నిర్ణయించుకునే పూర్తి విచక్షణ మనపైనే ఉంటుందని నటి అనసూయ భరద్వాజ్ అన్నారు. సమాజంలో జరిగే విషయాలకు సినిమాలతో ముడిపెట్టొద్దని అన్నారు. చిత్రరంగంపై బాధ్యత, సృజనాత్మక స్వేచ్ఛ గురించి ఆమె సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.'ఒకప్పటి కథలలో నైతికత కనిపించేది. హీరో పాత్రలు స్ఫూర్తిదాయ కంగా ఉండేవి. విలన్ పాత్రలు మనం అనుకరించకూడదు అనిపించేలా ఉండేవి. ఈ రోజుల్లో తెరకెక్కే కథల్లో ఈ స్పష్టత లోపిస్తోంది. పాత్రను గొప్పగా చూపించడం కోసం దర్శకులు ఈ గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. ఒక కథను తెరకెక్కిస్తు న్నామంటే.. దాని ప్రభావం ఎలా ఉంటుందనే దానిలో టెక్నికల్ టీమ్ నుంచి దర్శక నిర్మాతలు, నటీనటులు, చివరకు ప్రేక్షకులు కూడా కీలక పాత్రధారులే.

# రామాయణ, వారణాసి బడ్జెట్ లెక్కలు




### హైప్ క్రియేట్ చేస్తున్నారని కొట్టి పారేసిన మనోజ్

రామాయణ' పై 4000 కోట్ల బడ్జెట్ పెట్టారు. పాన్ ఇంటర్నేషనల్ మూవీ 'వారణాసి', 1300 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతోంది. రామాయణ, వారణాసి బడ్జెట్ షాక్ ఇస్తోంది. అయితే ఇందులో ఎంతమాత్రం నిజం లేదని ఇదంతా కేవలం హైప్ క్రియేట్ చేయడానికే అని బాలీవుడ్ యాక్టర్ మనోజ్ బాజ్‌పాయ్ తేల్చి పారేసాడు.

రాజమౌళి అంటేనే బ్జడెట్. తెలుగు తెరకే కాదు, ఇండియన్ సిల్వర్ స్క్రీన్‌కు భారీ బ్జడెట్, భారీ వసూళ్లు ఎలా ఉంటాయో చూపించాడు రాజమౌళి. తెలుగు సినిమా బ్జడెట్ 20 కోట్ల లోపే ఉన్న సమయంలో, 'మగధీర' పై 40 కోట్లు పెట్టించాడు. బాక్స్ ఆఫీస్ దగ్గర 50 కోట్ల మార్కు దాటిన తొలి చిత్రంగా 'మగధీర' నిలిచింది. ఇక 'బాహుబలి 2' తో రాజమౌళి సెట్ చేసిన రికార్డులు ఇప్పటికీ కొన్ని చోట్ల పదిలంగానే ఉన్నాయి. మరి ఇంత ట్రాక్ రికార్డు ఉన్న రాజమౌళి, 'వారణాసి' తో పాన్ ఇంటర్నేషనల్‌కు పరిచయం అవుతున్నాడు. దీనికి తగ్గట్టే బ్జడెట్ పెంచేసాడు. 'వారణాసి' 800 కోట్ల బ్జడెట్‌తో మొదలైంది. సెట్స్ పైకి వెళ్ళాక 1000 కోట్లు అన్నారు. ఏడాది పాటు షూటింగ్ పూర్తి చేశాక, 1300 కోట్లకు వెళ్ళిందన్నారు. సినిమా పూర్తి అయ్యేసరికి 1500 కోట్లకు చేరినా ఆశ్చర్యం లేదు. బాలీవుడ్ యాక్టర్ మనోజ్ బాజ్‌పాయ్, రామాయణ, వారణాసి బ్జడెట్‌పై చేసిన షాకింగ్ కామెంట్స్ వైరల్ అయ్యాయి. ఈ సినిమాల బ్జడెట్ లెక్కలన్నీ కేవలం పిఆర్ టీం స్టంట్ అని ఆయన అభిప్రాయపడ్డాడు. 15 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఇదే తంతు నడుస్తోందని, హైప్ కోసం చెప్పే నంబర్స్ అంటూ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. 4 వేల కోట్ల బ్జడెట్‌తో హిందీ 'రామాయణ' తెరకెక్కుతోంది. ఒక్కో పార్ట్‌కు 2000 కోట్లు ఖర్చు పెడుతున్నారు. దాదాపు సగం పైగా బ్జడెట్ విఎఫ్ఎక్స్ కే ఖర్చు పెడుతున్నారట. ఎన్ని కోట్లు పెట్టినా 4000 కోట్ల బడ్జెట్ అనేది నమ్మేలా లేదంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. మనోజ్ బాజ్‌పాయ్ చెప్పిన పిఆర్ టీం బ్జడెట్ లెక్కల్లో ఎంత నిజం ఉందో లేదో గానీ, ఈ కామెంట్స్ పెద్ద చర్చకు దారితీశాయి. మనోజ్ నటిస్తున్న 'గవర్నర్' మూవీ 12న రిలీజ్ అవుతోంది. సినిమా వస్తోందన్న సంగతి చాలామందికి తెలియడం లేదు, అందుకే తన సినిమాకు హైప్ తీసుకొచ్చేందుకే ఇలా మాట్లాడాడంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు.

# పెద్ది సినిమాలో ముద్దు సన్నివేశం


- జాన్వీ పాత్రపై నెటిజన్ల విమర్శలు
- ప్రేక్షకుల మనోభావాలు గౌరవిస్తామన్న బుచ్చిబాబు






రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో వచ్చిన 'పెద్ది' సినిమాలో రామ్ చరణ్ పాత్రకు ప్రశంసలు దక్కినప్పటికీ జాన్వీకపూర్ రోల్‌పై మాత్రం విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా ఇందులోని ఓ ముద్దు సన్నివేశం నెట్టింట వైరల్‌గా మారింది. ఏ సందర్భం లేకుండా ఉద్దేశపూర్వకంగా దాన్ని పెట్టారంటూ నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. ఆమెను గ్లామర్ వరకే పరిమితం చేశారని పోస్ట్‌లు పెడుతున్నారు. దీనిపై తాజాగా దర్శకుడు బుచ్చిబాబు స్పందించారు. ఆ సన్నివేశాలకు ప్రేక్షకుల నుంచి ఇంత ప్రతికూల స్పందన వస్తుందని తాను ఊహించలేదని బుచ్చిబాబు పేర్కొన్నారు. రామ్ చరణ్, జాన్వీకపూర్ మధ్య ఒక ఆహ్లాదకరమైన, సరదాగా సాగే ప్రేమకథను చూపించాలనేదే తమ ఉద్దేశమని ఆయన వివరించారు. ప్రేక్షకులకు కలిగిన అసంతృప్తిని దృష్టిలోఉంచుకుని, రాబోయే రోజుల్లో పాత్రలను, సన్నివేశాలను తెరకెక్కించేటప్పుడు మరింత జాగ్రత్తగా ఉంటామని అన్నారు. ఇకపై అలాంటి సన్నివేశాలు ప్రేక్షకులకు నచ్చేవిధంగా ప్రెజెంట్ చేస్తామని ఆయన తెలిపారు. మహిళలంటే తనకు ఎప్పుడూ అపారమైన గౌరవం ఉందని దర్శకుడు బుచ్చిబాబు తెలిపారు. హీరోయిన్ పాత్రను చూపించిన విధానంతో పాటు కొన్ని సన్నివేశాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సెలబ్రిటీలు సైతం వీటిని తప్పుపడుతూ పోస్ట్‌లు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో బుచ్చిబాబు వివరణ ఇచ్చారు. క్షమాపణలు కోరుతూ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.'ఒక దర్శకుడిగా.. సినిమాతో ప్రేక్షకులను అలరించాలి, వారిలో స్ఫూర్తి నింపాలని, వారితో మమేకం కావాలని నేను అనుకుంటాను. ఎవరినీ అసౌకర్యానికి గురిచేయాలని, అగౌరవపరచాలని చూడను. 'పెద్ది'లోని కొన్ని సన్నివేశాలపై విమర్శలు మా దృష్టికి వచ్చాయి. వాటిని తీవ్రంగా పరిగణించాం. తెరపైన, తెర వెనుక కూడా మహిళలంటే నాకు ఎప్పుడూ అపారమైన గౌరవం ఉంది. మహిళల పాత్రలను అగౌరవపరచడం నా ఉద్దేశం కాదు. ఈ సినిమాలో సన్నివేశాలు మీ మనోభావాలు దెబ్బతీసేలా ఉంటే.. మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నాను' అని బుచ్చిబాబు తన పోస్ట్‌లో రాశారు. ఇక విమర్శలు వస్తోన్న నేపథ్యంలో ఆయా సన్నివేశాల్లో మార్పులు చేస్తున్నట్లు బుచ్చిబాబు తెలిపారు.

# రజత్ పాటిదార్‌కు మరోసారి మొండిచేయి



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) కెప్టెన్ రజత్ పాటిదార్‌కు మరోసారి మొండి చెయ్యే ఎదురైంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శనతో పాటు సూపర్ కెప్టెన్సీతో ఆర్‌సీబీని విజేతగా నిలబెట్టినా.. వరుసగా రెండో టైటిల్ అందించినా రజత్ పాటిదార్‌ను బీసీసీఐ సెలెక్టర్లు పట్టించుకోలేదు. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనతో పాటు ఆసియా గేమ్స్ కోసం ఎంపిక చేసిన భారత జట్టులోకి రజత్ పాటిదార్‌ను తీసుకోలేదు. శనివారం నయా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత టీ20 జట్టును అజిత్ అగార్కర్ నేతృత్వంలోని భారత సెలెక్షన్ కమిటీ ప్రకటించిన సంగతి తెలిసిందే. పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న సూర్యకుమార్ యాదవ్‌పై వేటు వేసిన సెలెక్షన్ కమిటీ అతని స్థానంలో శ్రేయస్ అయ్యర్‌ను కొత్త సారథిగా ఎంపిక చేసింది. వైస్ కెప్టెన్‌గా తెలుగు తేజం తిలక్ వర్మను నియమించింది. ఐపీఎల్‌లో విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగిన టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీకి కూడా అవకాశం కల్పించింది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో మొత్తం ఐదుగురు ఆటగాళ్లు ఉద్వాసనకు గురయ్యారు. నితీష్ కుమార్ రెడ్డి, రవి బిష్ణోయ్, ప్రిన్స్ యాదవ్‌లకు అవకాశం కల్పించారు. హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రాలకు విశ్రాంతి ఇవ్వగా.. రింకూ సింగ్, కుల్దీప్ యాదవ్‌పై వేటు పడింది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఈ కఠిన నిర్ణయాలు తీసుకున్నామని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ స్పష్టం చేశాడు. రజత్ పాటిదార్‌ను పరిగణలోకి తీసుకోకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. వరుసగా రెండు సీజన్లలో రజత్ పాటిదార్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. వరుసగా రెండు సీజన్లలో జట్టును విజేతగా నిలబెట్టడంతో రజత్ పాటిదార్‌కు టీమిండియా పిలుపు దక్కుతుందని అంతా అనుకున్నారు. కానీ సెలెక్టర్లు మాత్రం అతని ఊసే తీయలేదు. ఐపీఎల్ 2026 సీజన్‌లో 191 స్ట్రైక్‌రేట్‌తో 501 పరుగులు చేసిన రజత్ పాటిదార్... 30 ఫోర్లు, 42 సిక్సర్లు బాదాడు. డేంజరస్ మిడిలార్డర్ బ్యాటర్‌గా గుర్తింపు పొందాడు. ముఖ్యంగా 7 నుంచి 11 ఓవర్ల మధ్య ఆకాశమే హద్దుగా చెలరేగాడు. డెత్ ఓవర్లలోనూ సత్తా చాటాడు. ప్రస్తుతం భారత జట్టుకు ఎంపికైన ఆటగాళ్లలో చాలా మంది రజత్ పాటిదార్ కంటే తక్కువ పరుగులు చేసినవారే. కానీ 33 ఏళ్ల వయసు అనే ఒకే ఒక్క కారణంతో రజత్ పాటిదార్‌ను సెలెక్టర్లు పక్కకు పెట్టినట్లు తెలుస్తోంది. వయసు ముఖ్యం కాదని చాలా మంది ఆటగాళ్లు నిరూపించినా.. భారత సెలెక్టర్లు మాత్రం ఏజ్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. అద్భుతమైన లీడర్‌షిప్ స్కిల్స్, స్పిన్నర్లను చితక్కొట్టే సామర్థ్యం ఉన్నా.. రజత్ పాటిదార్‌ను సెలెక్టర్లు పట్టించుకోవడం లేదు. ఐపీఎల్ ప్రదర్శనకు ప్రాధాన్యత ఇచ్చే సెలెక్టర్లు రజత్ పాటిదార్ విషయంలో మాత్రం భిన్నంగా వ్యవహరిస్తున్నారని నెటిజన్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రజత్ పాటిదార్ ఏ పాపం చేశాడని నిలదీస్తున్నారు.

## టెస్టు క్రికెట్ మ్యాచ్ మధ్యలో పింక్ బాల్..



రానున్న రోజుల్లో టెస్టు క్రికెట్‌లో ఐసీసీ కొత్త రూల్‌ని ప్రవేశపెట్టనుంది. కొన్ని కొన్ని సార్లు బ్యాడ్ లైట్ కారణంగా ఆ రోజులో వేయాల్సిన ఓవర్లు ఉన్నా మ్యాచ్‌ని ముందుగానే ముగిస్తుంటాం. ఇకపై ఇలాంటి పరిస్థితి వచ్చినప్పుడు పింక్ బాల్‌ని ఉపయోగించేలా ఐసీసీ కొత్త రూల్ తీసుకొస్తోంది. ఐసీసీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సమర్థించాడు. అక్టోబర్ 1 నుంచి ఈ రూల్ అమలులోకి రానుంది.ఐసీసీ తాజాగా క్రికెట్‌లో కొత్త నిబంధన తీసుకొచ్చింది. టెస్టు క్రికెట్‌లో బ్యాడ్ లైట్ కారణంగా ఆటకు అంతరాయం కలిగినప్పుడు పింక్ బాల్‌ను ఉపయోగించాలని అని ఐసీసీ తీసుకున్న నిర్ణయాన్ని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్వాగతించాడు. ఈ కొత్త నిర్ణయం అక్టోబర్ 1 నుంచి అమలులోకి రానున్నట్లు ఐసీసీ పేర్కొంది. ఇటీవల జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో సాధారణ టెస్టు మ్యాచ్‌లలో కూడా పింక్ బాల్‌ను ప్రయోగాత్మకంగా ఉపయోగించేందుకు ఆమోదం లభించింది. మ్యాచ్ ఎప్పటిలాగా రెడ్ బాల్‌తోనే ప్రారంభమవుతుంది. ఒకవేళ మ్యాచ్ మధ్యలో బ్యాడ్ లైట్ కారణంగా ముందుగా దేని ముగించాల్సి ఉన్న సందర్భంలో పింక్ బాల్‌తో మిగిలిన ఓవర్లు పూర్తి చేసే అవకాశం ఉంటుంది. ఈ నిర్ణయం తనకు బాగా నచ్చిందని గౌతమ్ గంభీర్ అన్నాడు. “నాకు ఈ నిర్ణయం చాలా నచ్చింది. ఎందుకంటే మ్యాచ్‌కు ఫలితం వచ్చే అవకాశం ఉంటే దాన్ని ఎప్పుడూ కోల్పోకూడదని నేను నమ్ముతాను” అని చెప్పాడు. భారత్ 2027 ఫిబ్రవరి – మార్చిలో స్వదేశంలో ఆస్ట్రేలియాతో బోర్డర్ – గవాస్కర్ ట్రోఫీ ఆడనుంది. ఇందులో గువాహటి, రాంచీలో టెస్టులు జరగనున్నాయి. అక్కడ సాయంత్రం 4 గంటలకే చీకటి పడే అవకాశం ఉంటుంది. దీంతో ఓవర్లు కోల్పోయే పరిస్థితి రావొచ్చు. ఇదే విషయాన్ని గంభీర్ కూడా స్పష్టం చేశాడు. “వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించే చివరి టెస్టు మ్యాచ్ ఆడుతున్నారని ఊహించుకోండి. మీరు గెలవాల్సిన మ్యాచ్‌లో బ్యాడ్ లైట్ కారణంగా ఫలితం రాకపోతే ఎంత నిరాశగా ఉంటుంది. రెండు జట్లు అంగీకరిస్తే ఫలితం కోసం పింక్ బాల్ వేయడాన్ని నేను పూర్తిగా సపోర్ట్ చేస్తాను” అని గంభీర్ అన్నాడు. అయితే, ఒకే మ్యాచ్‌లో రెండ్ బాల్ నుంచి పింక్ బాల్‌కి మారడం కూడా ఆటగాళ్లకు సవాలుగా మారొచ్చని గంభీర్ అంగీకరించాడు. ఐదు రోజుల టెస్టు మ్యాచ్‌లో బ్యాడ్ లైట్ కారణంగా మ్యాచ్ సరిగ్గా జరగకపోతే అప్పుడు రెండు జట్లు బాధపడాల్సి వస్తుంది. దానికోసమే ఐసీసీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని తాను సమర్థిస్తున్నట్లు గంభీర్ చెప్పాడు.

## భవిష్యత్తు ప్రణాళికల్లో భాగంగానే శ్రేయస్‌కు బాధ్యతలు

**చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ వివరణ**



భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను జట్టు నుంచి పూర్తిగా తొలగించడంపై బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ శనివారం కీలక వివరణ ఇచ్చారు. మూడు నెలల క్రితమే దేశానికి టీ20 ప్రపంచకప్ అందించి, ఎంఎస్ ధోని, రోహిత్ శర్మల సరసన నిలిచిన కెప్టెన్‌ను పక్కన పెట్టడం సులువైన నిర్ణయం కాదని ఆయన అంగీకరించారు. అయితే ఒక మెగా టోర్నీ ముగిసిన తర్వాత భవిష్యత్తు ప్రణాళికలను పునఃసమీక్షించుకోవడం సహజమని పేర్కొన్నారు. సూర్యకుమార్ వ్యక్తిగత ఫామ్ క్షీణించడం, అదే సమయంలో రాబోయే రెండేళ్ల ప్రపంచకప్ సైకిల్‌ను దృష్టిలో ఉంచుకుని జట్టు మేనేజ్‌మెంట్ ఈ కఠిన నిర్ణయం తీసుకుందని అగార్కర్ స్పష్టం చేశారు. జట్టు ప్రయోజనాల దృష్ట్యా శ్రేయస్ అయ్యర్‌ను కొత్త కెప్టెన్‌గా నియమించడమే సరైన మార్గమని సెలెక్షన్ కమిటీ భావించింది.ఐపీఎల్ టోర్నీలలో వేర్వేరు జట్లను విజయవంతంగా నడిపించిన అపారమైన నాయకత్వ అనుభవం శ్రేయస్ అయ్యర్‌కు ఉందని అగార్కర్ కొనియాడారు. 2024లో కోల్‌కతా నైట్ రైడర్స్‌ను విజేతగా నిలిపిన అయ్యర్, ఆ తర్వాతి సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌ను రన్నరప్‌గా నిలబెట్టారు. ప్రస్తుత 2026 ఐపీఎల్ సీజన్ ప్రారంభంలో పంజాబ్ జట్టును వరుసగా ఏడు మ్యాచ్‌ల్లో అజేయంగా నడిపించి, కేవలం ఒక్క పాయింట్ తేడాతో ప్లేఆఫ్స్ అవకాశాన్ని కోల్పోయారు. కెప్టెన్‌గా ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో ఆయన నిరూపించుకున్నారు. నాయకత్వ బాధ్యతలతో పాటు బ్యాటర్‌గా కూడా అయ్యర్ స్థిరమైన ప్రదర్శన చేయడం సెలెక్టర్లను ఎంతగానో ఆకట్టుకుంది. గత ప్రపంచకప్ జట్టు ఎంపిక సమయంలోనే శ్రేయస్ అయ్యర్ రేసులో నిలిచారని, అయితే అప్పట్లో సూర్యకుమార్ జట్టులో ఉండటం వల్ల ఆయనకు చోటు దక్కలేదని అగార్కర్ వెల్లడించారు.

# రాహుల్, గిల్ సెంచరీల మోత..

- భారీ స్కోరు దిశగా భారత్..!
- అఫ్ఘాన్‌తో భారత్ ఏకైక టెస్టు



అఫ్ఘానిస్థాన్‌తో శనివారం ప్రారంభమైన ఏకైక టెస్టు తొలి రోజు ఆటలో టీమిండియా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ముల్లాన్‌పూర్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్.. తొలి రోజు ముగిసేసరికి 3 వికెట్ల నష్టానికి 368 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ శతకాలతో కదం తొక్కగా, యువ బ్యాటర్ సాయి సుదర్శన్ (81), రిషభ్ పంత్ (50 నాటౌట్) అర్ధసెంచరీలతో రాణించారు. అఫ్ఘాన్ బౌలర్లలో సలీమ్ సఫీ రెండు వికెట్లు పడగొట్టాడు. అఫ్ఘానిస్థాన్‌తో శనివారం ప్రారంభమైన ఏకైక టెస్టు మ్యాచ్ తొలి రోజు ఆటలో టీమిండియా ఆధిక్యం కనబరిచింది. న్యూచండీగఢ్‌లోని ముల్లాన్‌పూర్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నాడు. యశస్వి జైశ్వాల్‌తో పాటు కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్ ప్రారంభించాడు. అయితే 32 బంతుల్లో 24 రన్స్ చేసిన తర్వాత జైశ్వాల్.. తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన సాయి సుదర్శన్.. రాహుల్‌తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు.ఆడేది టెస్టు మ్యాచ్ అయినా.. సాయి సుదర్శన్ మాత్రం వేగంగా పరుగులు రాబట్టాడు. హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుని.. సెంచరీ దిశగా అడుగులు వేశాడు. మరోవైపు కేఎల్ రాహుల్ కూడా ఈజీగా పరుగులు రాబట్టాడు. దీంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. ఈ క్రమంలోనే కేఏల్ రాహుల్ శతకం పూర్తి చేసుకున్నాడు. అయితే అదే స్కోరు వద్ద అతడు క్యాచ్ ఔట్ అయ్యాడు. సాయి సుదర్శన్ 104 బంతుల్లో 81 రన్స్ చేసి పెవిలియన్ చేరిపోయాడు. రాహుల్, సుదర్శన్.. రెండో వికెట్‌కు 139 పరుగులు జోడించారు. ఆ తర్వాత స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లే బాధ్యతను కెప్టెన్ శుభ్‌మన్ గిల్ , రిషభ్ పంత్ తీసుకున్నారు. ఈ క్రమంలోనే శుభ్‌మన్ గిల్.. తన టెస్ట్ కెరీర్‌లో మరో శతకాన్ని పూర్తి చేశాడు. మరోవైపు రిషభ్ పంత్ కూడా ధాటిగా బ్యాటింగ్ చేసి.. అర్ధశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. దీంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్.. 85 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 368 పరుగులతో నిలిచింది. ప్రస్తుతం క్రీజులో శుభ్‌మన్ గిల్ (143 బంతుల్లో 103 రన్స్), రిషభ్ పంత్ (70 బంతుల్లో 50 రన్స్) ఉన్నారు. అఫ్ఘానిస్థాన్ బౌలర్లలో మహమ్మద్ సలీమ్ సఫీ రెండు వికెట్లు తీశాడు. రెహ్మాన్ షరీఫ్ ఒక వికెట్ పడగొట్టారు. టీమిండియా రెండో రోజు ఆటలో 500 రన్స్ మార్కును చేరుకుని.. ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసే అవకాశం ఉంది.

# సచిన్ రికార్డు బ్రేక్ చేసిన వైభవ్



ఐపీఎల్ 2026లో రికార్డుల మోత మోగించిన 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి జాతీయ జట్టు నుంచి తొలిసారి పిలుపు వచ్చింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌ల కోసం ప్రకటించిన భారత జట్టులో అతడికి చోటు దక్కింది. 15 ఏళ్ల 70 రోజుల వయసులోనే ఎంపికై సచిన్ టెండూల్కర్ రికార్డును వైభవ్ బ్రేక్ చేశాడు. ఐపీఎల్‌లో 776 పరుగులు, 72 సిక్సర్లతో ఆరెంజ్ క్యాప్, మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ అవార్డులను గెలుచుకుని, సెలక్టర్లు కచ్చితంగా ఎంపిక చేయాల్సిన పరిస్థితిని అతడు కల్పించాడు.15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్‌లో రికార్డుల బూజు దులిపిన వైభవ్ సూర్యవంశీకి జాతీయ జట్టు నుంచి పిలుపు అందింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో త్వరలో జరగనున్న టీ20 సిరీస్ కోసం భారత సెలక్షన్ కమిటీ శనివారం జట్లను ప్రకటించింది. ఇందులో వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కింది. తన ప్రదర్శనతో జట్టులో ఎంపిక చేయక తప్పని పరిస్థితిని వైభవ్ కలిగించాడని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ వెల్లడించాడు. అయితే భారత జట్టు నుంచి తొలిసారి పిలుపు అందుకోవడం ద్వారా.. వైభవ్ సూర్యవంశీ రికార్డు క్రియేట్ చేశాడు.15 ఏళ్ల 70 రోజుల వయసులో వైభవ్‌కు టీమిండియా నుంచి పిలుపు అందింది. గతంలో ఈ రికార్డు టీమిండియా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉంది. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్.. భారత్ తరఫున 16 ఏళ్ల 205 రోజులు ఉన్నప్పుడు ఎంపికయ్యాడు. తాజాగా ఆ రికార్డును వైభవ్ సూర్యవంశీ బ్రేక్ చేశాడు. ప్రపంచ దృష్టిని తనవైపు ఆకర్షించాడు. కాగా ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026లో వైభవ్ సూర్యవంశీ పలు భారీ రికార్డులు బ్రేక్ చేశాడు. తన పవర్ బ్యాటింగ్‌తో సత్తాచాటిన అతడు.. భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. ఈ సీజన్‌లో అతడు ఏకంగా 72 సిక్సర్లు బాదాడు. దీంతో ఓ ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన గేల్ రికార్డును బ్రేక్ చేశాడు. యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్.. 2012 సీజన్‌లో 65 సిక్సర్లు బాదడం గమనార్హం. మరోవైపు ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ ఎడిషన్‌లో ఈ 15 ఏళ్ల చిచ్చర పిడుగు 16 మ్యాచులలో ఆడాడు. అందులో ఏకంగా సుమారు 240 స్ట్రైక్ రేటుతో 776 పరుగులు స్కోరు చేశాడు. దీంతో ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. అంతేకాకుండా 436.5 పాయింట్స్‌తో మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్ అవార్డు సొంతం చేసుకున్నాడు. 72 సిక్సర్లతో సూపర్ సిక్సెస్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచాడు. 237.31 స్ట్రయిక్ రేట్‌తో సూపర్ స్ట్రయికర్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచాడు. ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్ అవార్డు కూడా వైభవ్ సూర్యవంశీకే దక్కడం గమనార్హం.

## నార్వే చెస్ చాంపియన్‌గా ప్రజ్ఞానంద..

భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద అంతర్జాతీయ చదరంగ వేదికపై సరికొత్త చరిత్ర సృష్టించారు. ప్రతిష్టాత్మక నార్వే చెస్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన తొలి భారతీయ ఆటగాడిగా ఆయన రికార్డు సృష్టించారు. ఈ అద్భుత విజయంపై స్పందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియా వేదికగా ప్రజ్ఞానందకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రజ్ఞానంద సాధించిన ఈ ఘనత భారత చెస్ రంగానికి ఒక గొప్ప మైలురాయి అని, అంతర్జాతీయ స్థాయిలో ఆయన చూపిస్తున్న ప్రతిభ అద్భుతమని ప్రధాని కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. నార్వే రాజధాని ఓస్లోలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో సాధించిన విజయం ప్రజ్ఞానంద కెరీర్‌లోనే అత్యుత్తమమైనదిగా నిలిచిపోతుంది. ఈ టోర్నమెంట్‌లో ఒక దశలో వెనుకబడిన చెన్నై యువ సంచలనం ప్రజ్ఞానంద, ద్వితీయార్ధంలో అద్భుతంగా పుంజుకుని ప్రపంచ అత్యుత్తమ ఆటగాళ్లను ఓడించారు. చివరి రౌండ్‌కు ముందు అమెరికా గ్రాండ్‌మాస్టర్ వెస్లీ సో స్వల్ప పాయింట్ల ఆధిక్యంతో టైటిల్ రేసులో ముందున్నారు. అయితే చివరి క్లాసికల్ గేమ్‌లో వెస్లీ సో డ్రా చేసుకోవడంతో ప్రజ్ఞానందకు సువర్ణావకాశం లభించింది. ఆఖరి పోరులో జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌ను తెల్ల ముక్కలతో ఎదుర్కొన్న ప్రజ్ఞానంద, ఒత్తిడిని అధిగమించి అద్భుతమైన ఆటతీరుతో విజయం సాధించారు. వరుసగా నాలుగో క్లాసికల్ విజయాన్ని నమోదు చేయడం ద్వారా పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుని నార్వే చెస్ చాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ టోర్నమెంట్‌లో ప్రపంచ నంబర్ వన్ మాగ్నస్ కార్లసన్, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ డి గుకేష్, వెస్లీ సో, అలీరెజా ఫిరౌజ్జా వంటి దిగ్గజాలు బరిలో నిలిచారు. ఇంతటి కఠినమైన పోటీలో ప్రజ్ఞానంద కేవలం ఒకే వారంలో కార్లసన్, గుకేష్, ఫిరౌజ్జా, కీమర్లను క్లాసికల్ గేమ్‌లలో ఓడించడం విశేషం. ముఖ్యంగా హోమ్ గ్రౌండ్‌లో ఆడుతున్న ప్రపంచ నంబర్ వన్ మాగ్నస్ కార్లసన్‌ను ఒకే టోర్నమెంట్‌లో రెండుసార్లు క్లాసికల్ చెస్‌లో ఓడించిన రెండో భారతీయ ఆటగాడిగా (విశ్వనాథన్ ఆనంద్ తర్వాత) ప్రజ్ఞానంద అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నారు. ఈ అద్భుత ప్రదర్శన ద్వారా లైవ్ రేటింగ్స్‌లో ఆయన ప్రపంచవ్యాప్తంగా 11వ స్థానానికి ఎగబాకారు.

## రోహిత్ మళ్లీ అద్భుతాలు సృష్టిస్తాడు

**కోచ్ దినేష్ లాడ్ గట్టి కౌంటర్**

ఇండియా మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ ఫామ్, ఫిట్‌నెస్ పై వస్తున్న విమర్శలకు అతడి చిన్ననాటి కోచ్ దినేష్ లాడ్ గట్టి కౌంటర్ ఇచ్చాడు. శుక్రవారం ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో దినేష్ లాడ్ మాట్లాడుతూ, రోహిత్ ఎవరికీ ఏమీ నిరూపించుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశాడు. ఇండియాకు వన్డే వరల్డ్ కప్ గెలిపించాలనే పట్టుదల రోహిత్ ను ఇంకా మోటివేట్ చేస్తోందని అన్నాడు. వన్డే క్రికెట్ లో మూడు డబుల్ సెంచరీలు చేసిన ఏకైక ప్లేయర్ రోహిత్ అని, 2019 వరల్డ్ కప్ లో ఐదు సెంచరీలు చేసిన రికార్డు అతడికి ఉందని గుర్తు చేశాడు. టెస్టులు, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్, వన్డేల్లో మాత్రం ఇండియాను ఫైనల్స్ కు చేర్చడానికి తన ఎక్స్ పీరియన్స్ తో హెల్ప్ అవుతాడని చెప్పాడు.రోహిత్ శర్మ రాబోయే ఆరు నెలల్లో తన ఫిట్‌నెస్, బ్యాటింగ్ ఫామ్ ను నిరూపించుకుంటేనే 2027 వన్డే వరల్డ్ కప్ సెలెక్షన్ ప్లాన్స్ లో ఉంటాడని మాజీ సెలెక్టర్ సబా కరీం చేసిన కామెంట్స్ పై దినేష్ లాడ్ మండిపడ్డాడు. ఆరు నెలల టైమ్ అనేది ఒక్క రోహిత్ కే కాదు, టీమ్ లోని ప్రతి ప్లేయర్ కు ఇంపార్టెంట్ అని అన్నాడు. రోహిత్ 2027 వరల్డ్ కప్ కచ్చితంగా ఆడతాడని తనకు 100 పర్సెంట్ గ్యారెంటీ ఉందని స్పష్టం చేశాడు. రోహిత్ ఖాళీగా ఉంటూ లైఫ్ ఎంజాయ్ చేయడం లేదని, ప్రతిరోజూ ప్రాక్టీస్ చేస్తూ తన ఫిట్‌నెస్ పై వర్క్ చేస్తున్నాడని తెలిపాడు. న్యూజిలాండ్ తో జరిగిన వన్డే సిరీస్ లో మూడు ఇన్నింగ్స్ లో 61 రన్స్ మాత్రమే చేయడంతో రోహిత్ పై విమర్శలు పెరిగాయి. అయితే రోహిత్ టెక్నిక్ పరంగా ఎలాంటి ప్రాబ్లం లేదని లాడ్ అన్నాడు. వన్డే క్రికెట్ లో కాసేపు క్రీజులో సెటిల్ అవ్వడం ముఖ్యమని, రోహిత్ కు ఆ టెక్నిక్ బాగా తెలుసని చెప్పాడు. రీసెంట్ ఐపీఎల్ లో కూడా కేవలం బిగ్ షాట్స్ మాత్రమే కాకుండా సింగిల్స్, డబుల్స్ తీస్తూ రోహిత్ తన క్లాస్ టెక్నిక్ ను చూపించాడని గుర్తు చేశాడు. విమర్శకులు ఏదేదో మాట్లాడుతుంటారని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నాడు.రోహిత్ శర్మకు తన కెరీర్ లోని ఈ కీలక ఫేజ్ లో లాడ్ ఒక ముఖ్యమైన అడ్వైజ్ ఇచ్చాడు. క్రీజులో కాసేపు నిలబడి సెటిల్ అయితే రోహిత్ ఎంత డేంజరస్ ప్లేయరో అందరికీ తెలుసని అన్నాడు. 2019 వరల్డ్ కప్ లో ఎలా ఆడాడో రోహిత్ మరోసారి గుర్తు తెచ్చుకొని అలాగే ఆడాలని కోరాడు. నిద్రలో నుంచి లేచినా రోహిత్ బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇస్తాడని, వరల్డ్ కప్ కంటే ముందే ఇండియాలో జరిగే డొమెస్టిక్ 50 ఓవర్ల మ్యాచ్ లలో ఆడితే మరింత టచ్ లోకి వస్తాడని సజెస్ట్ చేశాడు. ఇండియా కోసం వరల్డ్ కప్ గెలవడమే రోహిత్ మెయిన్ టార్గెట్ అని, అది సాధించాకే రిటైర్ అవుతాడని కోచ్ స్పష్టం చేశాడు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers,
RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609